

## రేషన్ బియ్యం పట్టివేత

మెదక్ (ప్రజాజ్యోతి)

తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 49.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత తూప్రాన్ ఎస్ఐ గంగరాజు వాహన తనిఖీలు చేస్తుండగా పిడిఎస్ రేషన్ బియ్యం గుర్తించి వాహనాన్ని పట్టుకొని మెదక్ సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యాన్ని పంచనామా చేసి అల్లాపూర్ నవదుర్గ రైస్ మిల్ కు తరలించిన సివిల్ సప్లై అధికారి నర్సింలు.




# సంగారెడ్డి మెదక్

గురువారం 20 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:10


# ఓటర్లూ జాగ్రత్త ఎస్ఐఆర్ డ్రాఫ్ట్‌లో మీ పేరు ఉందా?

- నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 4,978 ఓట్లు తగ్గుదల
- అర్హులైన ప్రతి ఓటరు వివరాలు పరిశీలించుకోవాలి:
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి







నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియతో నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. ఎస్ఐఆర్‌కు ముందు 17,550 మంది ఓటర్లు ఉండగా ముసాయిదా జాబితా అనంతరం ఈ సంఖ్య 12,572కు చేరింది. దీంతో 4,978 ఓట్లు తగ్గగా సుమారు 28.37 శాతం మేర ఓటర్ల సంఖ్య తగ్గింది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి వివరాల ప్రకారం .. ముసాయిదా జాబితాలో 6,395 మంది పురుషులు, 6,175 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు కలిపి మొత్తం 12,572 మంది ఓటర్లు ఉన్నారు.

### ఇంటింటి సర్వేతో జాబితా ప్రక్షాళన

ఎస్ఐఆర్‌లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. స్థానికంగా నివసించని వారు, అర్హత లేని వారు, ఇతర కారణాలతో తొలగించాల్సిన పేర్లను గుర్తించి జాబితాను సవరించారు. అయితే పెద్ద సంఖ్యలో ఓట్లు తగ్గిన నేపథ్యంలో అర్హత ఉన్న ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో ఉన్నాయా లేదా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.ఓటర్లు కేవలం తమ పేరు ఉందా లేదా అనే విషయానికే పరిమితం కాకుండా తండ్రి, భర్త పేరు, వయస్సు, లింగం, చిరునామా, ఫొటో తదితర వివరాలను కూడా పరిశీలించాలి. కుటుంబంలోని అర్హులైన సభ్యులందరి పేర్లు ఉన్నాయా? ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు నమోదైందా? వంటి అంశాలను కూడా గమనించాలి.

మిగతా 2 లో

# రాత్రి రెండు ఏటీఎంలో చోరీ



**మెదక్ జిల్లాలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి ఒకే రాత్రి రెండు ప్రాంతాల్లో ఎస్బిఐ ఎటిఎంలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి నగదు తో పరారి.**



మెదక్ (ప్రజాజ్యోతి )

చిన్న శంకరంపేట్ మండలం గవలపల్లి మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకున్నాయి గవలపల్లి లోని ఎస్బిఐ ఎటిఎంలో అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు అదే విధంగా మంభోజిపల్లిలో ఎస్బిఐ ఎటిఎంలోనూ చోరీ జరిగింది గుర్తుతెలియని కారులో వచ్చి ముగ్గురు దుండగులు ఏటీఎంలను పగలగొట్టి నగదు అపహరించినట్లు తెలుస్తోంది.

మిగతా 2 లో



# ఓటర్లూ జాగ్రత్త ఎస్ఐఆర్ డ్రాఫ్ట్‌లో మీ పేరు ఉందా?

మొదటిపేజీ తరువాయి



### మ్యాపింగ్, లింక్ సమస్యలపై దృష్టి

ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్, లింక్ తదితర సమస్యల కారణంగా కొందరు అర్హులైన ఓటర్ల పేర్లు కనిపించకపోయే అవకాశం ఉంది. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ణీత గడువులో దావా లేదా అభ్యంతరం దాఖలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

### సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాలు

ఎస్ఐఆర్ సవరించిన షెడ్యూల్ ప్రకారం 2026 ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుంది. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19న ప్రచురించనున్నారు.

### ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్నాం: ఎమ్మెల్యే

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిరంతరం సమావేశాలు నిర్వహిస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితాలో లేకుండా పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా, ఓటరు వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి దావా లేదా అభ్యంతరం దాఖలు చేసేలా ప్రజలకు సహకరించాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. మ్యాపింగ్, లింక్ తదితర సమస్యలు ఎదురైన వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు.

'నా ఓటునా హక్కు' అనే బాధ్యతతో ప్రతి అర్హ ఓటరు ముసాయిదా జాబితాను పరిశీలించి, పేరు లేకపోతే లేదా వివరాల్లో తప్పులు ఉంటే నిర్ణీత గడువులో దావా, అభ్యంతరం దాఖలు చేసుకోవాలని సూచించారు.

---

# రాత్రి రెండు ఏటీఎంలో చోరీ

మొదటిపేజీ తరువాయి

చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలు రికార్డు అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసు అధికారులను పలు సూచనలు చేశారు. ఏటీఎంలలో నుండి ఎంత మొత్తం నగదు అపహరణ గుర్తెందనే విషయం బ్యాంక్ అధికారులు



లెక్కలు పరిశీలి అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది సిసి కెమెరా ఫుటేజ్ ఆధారంగా దుండగులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమై నారు.

# మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణకు పటిష్ట చర్యలు

- స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- రైతులకు కోతుల బెడద నుంచి విముక్తి కల్పించేందుకు కృతనిశ్చయంతో పనిచేయాలి.





**మెదక్ (ప్రజా జ్యోతి)**

మెదక్ జిల్లాలో కోతుల బెడద నియంత్రణకు వేగవంతమైన కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లు, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్యతో కలిసి కోతుల బెడద నివారణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోతుల బెడద తీవ్రంగా పెరిగిందని, కోతులు పంటలను ధ్వంసం చేయడంతో పాటు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. కోతుల దాడుల్లో విద్యార్థులు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయని, ప్రజావాణిలో ఈ సమస్యపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు.రైతుల పంటలను కాపాడటంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడానికి స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ప్రజలు మరియు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కోతులను పట్టుకునేందుకు, తరలించేందుకు అవసరమైన నిధుల సమీకరణకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారం తీసుకోవాలని సూచించారు. పట్టుకున్న కోతులను అటవీ శాఖ అధికారుల సమన్వయంతో నిర్మల్ జిల్లాకు తరలించి, అక్కడ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స అనంతరం వాటిని విడిచిపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కోతుల బెడద నియంత్రణను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా ముందుకు సాగితే అందరి సహకారంతో సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని కలెక్టర్ అన్నారు. మెదక్ జిల్లాను కోతుల బెడద నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ

**మెదక్ (ప్రజాజ్యోతి)**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ ఎస్ఎస్సి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశం పై రూపొందించిన ప్రచార పోస్టర్ను మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు సార్ మెదక్ జిల్లా కోఆర్డినేటర్ ఏ వరప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ కరుణాకర్ డివో ఆఫీస్ సిబ్బంది తన కార్యాలయంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా డిఇఓ ఎస్ రాజు మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల సాధారణ పాఠశాల లేదా కళాశాల విద్యను కొనసాగించలేని వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఒక మంచి ప్రత్యామ్నాయ అవకాశం కల్పిస్తుందని తెలిపారు విద్యాభ్యాసాన్ని మధ్యలో నిలిపివేసిన వారు ఉద్యోగులు గృహిణులు వివిధ కారణాలవల్ల రెగ్యులర్ విద్యను కొనసాగించలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు టి ఇ ఓ ఎస్ రాజు ద్వారా ఎస్ఎస్సి మరియు ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉంది అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణయిత గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు కూడా ఈ అవకాశం పై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



# రైతుల నుంచి నేరుగా నాణ్యమైన కూరగాయల సేకరణ..

- కేంద్రీకృత వంటశాలలకు నిరంతర సరఫరాపై రైతులకు అవగాహన..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మందాపూర్ రైతువేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో కూరగాయల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయపాత్ర ఫౌండేషన్, మన్నా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీకృత వంటశాలలకు నాణ్యమైన కూరగాయలను రైతుల నుంచే నేరుగా సేకరించి, నిరంతరంగా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కూరగాయల సాగు, నాణ్యత ప్రమాణాలు, రైతుల నుంచి నేరుగా కూరగాయల సేకరణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతుల అభిప్రాయాలను అధికారులు స్వీకరించారు.ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జీడిమెట్ల నుంచి టమాటా, మిర్చి, వంకాయ నారును రైతులకు ఉచితంగా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా శాశ్వత కూరగాయల పందిరి ఏర్పాటుకు ఎకరాకు రూ.లక్ష వరకు సబ్సిడీ, ఆయిల్‌పామ్ సాగుకు ఎకరాకు రూ.50 వేల సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సి.హెచ్. పండరి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఉద్యాన అధికారి జి. అనూష రెడ్డి, హెచ్ఈఓ రవీందర్, మందాపూర్ సర్పంచ్ సంగమేశ్వర్, ఉప సర్పంచ్ విద్యాసాగర్, గంగారం గ్రామ సర్పంచ్ సరిత అశోక్, ఏఈఓ సంధ్య, ఏడీ వెంకటలక్ష్మితో పాటు గంగారం, మందాపూర్, శివన్నగూడెం, సీహెచ్ కోనాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



# భీమ్ ఆర్మీ( భారత్ ఏక్తా మిషన్) జహీరాబాద్ పట్టణ నూతన కమిటీ నియామకం

**జహీరాబాద్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి న్యూస్)**

భీమ్ ఆర్మీ చీఫ్ ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ మరియు జాతీయ అధ్యక్షులు వినయ్ రతన్ సింగ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ అధ్యక్షతన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నూతన కమిటీ నియామకం జరిగింది. వ్యవస్థలో మార్పు వచ్చి నప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్టు అని జ్యోతి రావు పూలే గారి జీవిత విధానమే ఆదర్శంగా తీసుకుని భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అడుగులు వేస్తుందని సిద్దు రావణ్ అన్నారు. బహుజన రాజ్యమే లక్ష్యంగా మాట్లాడుతూ యువతను కదిలిస్తే బహుజన రాజ్యం వైపే ఓట్లు మన సీట్లు అని యువతను ప్రశంసించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించడం పాపమైందని బానిసలం కాదు మనం పాలకుల మౌదామని ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ అలీమ్ హుస్సేన్ ని నియమించారు. మరియు భీమ్ ఆర్మీ నాయకులు బాలరాజు, జైపాల్, రాహుల్, సిద్దార్థ్, రవీందర్ రాంచందర్, మమ్మద్ ఫరూక్ మహమ్మద్ సద్దాం హుస్సేన్ మహమ్మద్ షఫీ హుస్సేన్ , మహమ్మద్ జమీల్ అబ్దుల్ గఫర్, మమ్మద్ మజార్ మహ్మాద్ రాయిస్ తదితరులు పాల్గొన్నారు.





# మా భూమి పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు...

- కాలకల్ కు చెందిన దశరథ రెడ్డి దగ్గర భూమి కొనుగోలు చేశాను మహాలక్ష్మి
- పెట్రోల్ తో పురుగుల మందు డబ్బాలతో అధికారులను బెదిరిస్తే భూమి వివరిస్తూ కాదు

**మనోహరాబాద్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి )**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన దశరథ రెడ్డి దగ్గర కొత్త కాల క్రితం మహాలక్ష్మి అయిన నేను ఏడెకరాల భూమిని కొనుగోలు చేసిన ఇది గిట్టని కొందరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులను బెదిరిస్తున్నారని దశరథ రెడ్డి చెల్లయిన మహాలక్ష్మి ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో మనోహరాబాద్ మల్లన్న దేవాలయ సన్నిధిలో సాక్షాత్తు నిజం పత్రాలు చూయిస్తూ హైకోర్టు నుంచి మాకు ఆర్డర్ ఉందని ఈ దస్తావేజులు స్థానిక తాసిల్దార్ కు ఆర్ డి ఓ కు సమర్పించామని ఏజీపీ భూమి చేసుకున్న తర్వాతే భూమిని కొనుగోలు చేశామని మహాలక్ష్మి మీడియాతో తెలిపారు. మాపై భయభ్రాంతులకు గురి చేస్తే పూర్తిస్థాయిలో ఫిర్యాదు చేయాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు కొందరు స్థానిక లీడర్లతో కలిసి బదలం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె తెలిపారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకొని భూమి జోలికి రావద్దని మహాలక్ష్మి సూటిగా తెలుపుతున్నానని ఆమె అన్నారు.



# చదువుకోవాల్సిన వయసులో చిన్నారుల చేతుల్లో చెత్త సంచులు

**రాయికోడ్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):**



చదువుకోవాల్సిన వయసులో చిన్నారులు రోడ్లపై చెత్త సంచులతో తిరుగుతున్న దృశ్యాలు రాయికోడ్ మండల కేంద్రంలో ఆందోళన కలిగిస్తున్నాయి.పాఠశాలల్లో ఉండాల్సిన పిల్లలు బడికి వెళ్లకుండా చెత్త సేకరిస్తున్న పరిస్థితులు కనిపించడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల పరిసరాల్లో కొందరు చిన్నారులు చెత్త సంచులు పట్టుకుని ప్లాస్టిక్,ఇతర వ్యర్థాలను సేకరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన పిల్లలు ఇలా రోడ్లపై చెత్త సేకరిస్తుండటంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిల్లల తల్లిదండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతున్నారా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచిస్తున్నారు.చెత్త సేకరిస్తున్న చిన్నారులను గుర్తించి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, వారికి విద్య అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాలల హక్కులు, విద్యా హక్కుకు భంగం కలగకుండా అధికారులు పర్యవేక్షణ పెంచాలని సూచిస్తున్నారు.చిన్నారుల చేతుల్లో చెత్త సంచులు కాకుండా పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## ఘనంగా జహీరాబాద్‌లో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**జహీరాబాద్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి న్యూస్)**

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జహీరాబాద్ ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు బుధవారం లక్ష్మి మినీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా సమాజంలోని చారిత్రక, సామాజిక, సాంస్కృతిక సంఘటన లను భవిష్యత్ తరాలకు భద్రపరిచే గొప్ప కళ అని వక్తలు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్లుఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లు, సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు .ఫోటోగ్రాఫర్ల ఐక్యతతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఫోటోగ్రాఫర్స్ సంఘం ప్రతినిధులు, సభ్యులు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు మరియు పలువురు ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వ్యక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయ వంతంగా ముగిసింది.



## అంగన్వాడీ కేంద్రాలకు ప్రతి నెల ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

- గ్యాస్ కోసం అంగన్వాడీ టీచర్లకు తప్పని తిప్పలు
- సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:**




జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు ప్రతి నెల అవసరమైన మేరకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాల్సి ఉండగా, గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేక అంగన్వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం గ్యాస్‌కు సంబంధించిన డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నప్పటికీ, అవసరమైన సమయంలో సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో చిన్నారులకు వంట చేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.గ్యాస్ కొరత కారణంగా చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహార తయారీలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల అంగన్వాడీ కేంద్రాల అవసరాలకు అనుగుణంగా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించాలని, గ్యాస్ సరఫరా బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీ టీచర్లపై అదనపు ఆర్థిక భారం పడకుండా సమస్యను వెంటనే పరిష్కరించి, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శక్తి స్కీమ్‌ను తొలగించాలని విద్యార్థుల నిరసన

**హత్నూర 19సంగారెడ్డి జిల్లా**

హత్నూర మండలం తుర్క ఖానాపూర్ పరిధిలోని రత్నపూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద బుధవారం నాడు విద్యార్థులు శక్తి స్కీమ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి స్కీమ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే శక్తి స్కీమ్‌పై తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థుల నిరసనకు ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పటేల్ జస్వంత్ గౌడ్, శ్రీనివాస్‌తో పాటు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## పూర్తిగా నీటితో మునిగిన ఫామ్ పాండ్‌లు రైతులు నిర్మాణానికి ముందుకు రావాలి

- యం పి డి ఓ. హరి నందరావు కల్హే ర్

**కల్హేర్. 19.ఆగస్టు. ప్రజా జ్యోతి**

రైతులందరూ ఫామ్ పాండ్‌లను నిర్మించుకోవాలని రైతు కల్హే ర్ మండలానికి చెందిన బాలరాజ్ సూచించారు. వీబీజీ రామ్‌జీ ద్వారా ఫామ్ పాండ్‌లను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాను నిర్మించిన కాంపౌండ్ లో పుష్కలంగా నీరు నిండడం ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు ప్రతి రైతు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇటువంటి మంచి పథకాలను సద్వినియోగం చేసుకో వాలని రైతు బాల్‌రాజ్ అనిక ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ తో కలిసి నిర్మించడం జరిగింది తెలిపారు. ఫామ్ పాండ్‌ల నిర్మాణంపై ఆసక్తి ఉన్న రైతులు తమ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించి, స్థానిక ఫీల్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సలహాలు, సూచనలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.రైతుల పొలాల పరిస్థితి, భూమి స్వభావం, నీటి లభ్యత తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ఎలాంటి ఫామ్ పాండ్ నిర్మాణం చేపట్టాలో అధికారులు రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ముందుకు రావాలని కోరుతున్నారు.ఫామ్ పాండ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని, అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# వీధికుక్కల బెడదపై అధికారుల నిర్లక్ష్యం

## ఎప్పుడు వీడుతుంది?



- బీబీపేటలో వరుస దాడులు.. ప్రజల్లో భయాందోళన
- అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**కల్హేర్: 19.ఆగస్టు. ప్రజా జ్యోతి**

కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట గ్రామంలో వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గత 24 గంటల్లోనే వీధికుక్కల దాడుల్లో పలువురు గాయపడినట్లు సమాచారం. దీంతో గ్రామస్తులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి కుక్కలు దాడి చేస్తాయోనన్న భయంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల ప్రాణ భద్రత కంటే ముఖ్యమైనది మరొకటి లేదు . వీధికుక్కల సమస్యను కేవలం సాధారణ సమస్యగా పరిగణించకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. గ్రామపంచాయతీ సిబ్బంది పరిస్థితిని పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బీబీపేటలో వీధికుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రజల భద్రతపై అధికారులు ఇకనైనా దృష్టి సారించాలి.**

## గృహప్రవేశం, వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన నూతన గృహప్రవేశం, వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం.మున్సిపాలిటీకి చెందిన నరేష్ యాదవ్ నూతనంగా నిర్మించిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన భూపాల్ రెడ్డి, నరేష్ యాదవ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరమహంస రాజు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, మున్సిపల్ కౌన్సిలర్లు విజయ్ బుజ్జి, అభిషేక్ షెట్కార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సేట్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, మాజీ కౌన్సిలర్ విట్టల్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అంబదాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, మండల పార్టీ యువత అధ్యక్షుడు మచ్చేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## సర్వే నంబర్1 రైతులకు 600 గజాలపై హామీ

- రెండు రోజుల్లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం.- జిన్నారం తహశీల్దార్





**జిన్నారం(ప్రజాజ్యోతి)**

జిన్నారం మండల కేంద్రంలో ఉన్న సర్వే నంబర్1 భూమి విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టేందుకు జిన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుటకు వచ్చిన రైతులతో అధికారులు చర్చలు జరిపారు. జిన్నారం గ్రామానికి చెందిన సర్వే నంబర్1లోని 421 ఎకరాల భూమి విషయంలో రైతులు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రిలే నిరాహార దీక్షకు రైతులు సిద్ధమవగా, జిన్నారం తహశీల్దార్, సీఐ, ఎస్ఐ,లు రైతులను కార్యాలయంలో కూర్చోబెట్టి చర్చించారు.దాదాపు రెండు గంటల పాటు జరిగిన చర్చల్లో రైతులకు ఎకరాకు 600 గజాల భూమి కేటాయించాలనే డిమాండ్‌ను అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహశీల్దార్ రైతుల సమక్షంలో ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు రైతులు తెలిపారు. ఈ అంశంపై రెండు రోజుల సమయం ఇవ్వాలని తహశీల్దార్ కోరడంతో రైతులు అంగీకరించారు. రెండు రోజుల్లో రైతులను తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి, సర్వే నంబర్1 భూమికి సంబంధించిన అంశంపై సమాచారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.అయితే హైకోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ సర్వే నంబర్1లోని భూమిని వివిధ సంస్థలకు కేటాయించారని రైతులు ఆరోపించారు. ఎస్టూా ఇంజనీరింగ్ కంపెనీకి 36 ఎకరాల చొప్పున భూమి కేటాయించారని, హెచ్ఎండీఏ లేఅవుట్‌కు 80 ఎకరాలు, టీజీఐసీకి 70 ఎకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉండగా భూముల కేటాయింపులు ఎలా జరిగాయని అధికారులను రైతులు ప్రశ్నించారు.తమకు రావాల్సిన 600 గజాల విషయంలో కోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకోవాలని కొంతమంది అధికారులు సూచిస్తున్నారని రైతులు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో రైతులను కొంతమంది అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్.. రైతులు, అధికారుల మధ్య మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చర్చిస్తామని తెలిపినట్లు రైతులు వెల్లడించారు. రెండు రోజుల అనంతరం అధికారులతో చర్చించిన తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు పుట్టి భాస్కర్, జి. శ్రీనివాస్ యాదవ్, బండి మహేందర్ గౌడ్, నరసింహులు, విట్టల్, రమేష్, జంగోని దుర్గయ్య, వడియపల్లి సుదర్శన్, మ్యాదరి నరసింహ, మోర సత్తమ్మ, కొరమైన పోచయ్య, తుర్రి అశోక్, నీలం వెంకటేష్, నీలం రాము, పుట్టి బిక్షపతి, పుట్టి రాజు, ఎందని నాగేష్, ఏర్పుల లక్ష్మి, కడన యాదమ్మ, వివర సత్తమ్మ, మున్ని రాజు, కొరవైన యాదగిరి, వినోద్, నాగులూరి రమేష్, ఏర్పుల పెంటయ్య, డప్పు బిక్షపతి, పోతరాజు మహేందర్, దానిని ఎల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అర్హులకే ఇవ్వాలి

## - రాజకీయ జోక్యంతో రుణాలు మంజూరు చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తాం

## - కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటారి నర్సింలు

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:




నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలను నిజమైన అర్హులకు మాత్రమే మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..స్థానిక మండల అభివృద్ధి అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తమకు నచ్చిన వారి పేర్లను ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. అర్హత ఉన్న నిరుపేదలను పక్కనపెట్టి రాజకీయ సిఫార్సులతో లబ్ధిదారులను ఎంపిక చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారిని పారదర్శకంగా ఎంపిక చేయాలని కోరారు. అర్హులకు కాకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో రుణాలు మంజూరు చేస్తే మండల అభివృద్ధి కార్యాలయాలు, కార్పొరేషన్ కార్యాలయాలను ముట్టడించి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెంటనే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎస్. గణపతి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాపూర్‌లో పెండ గుండయ్య కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

కల్హేరు, ఆగస్టు 19: ప్రజా జ్యోతి

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన పెండ గుండయ్య కుమారుడు మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను సంగారెడ్డి జిల్లా మైనారిటీ కోఆప్షన్ సభ్యులు అలీ, కల్హేర్ మండలం మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కూల్ చైర్మన్ హనుమాన్లు, సంగయ్య, పోచయ్య, అక్తార్, మల్లేశం, దుర్గయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## - అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి - అడిషనల్ కలెక్టర్ సంగీత

సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 19:-



-ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అడిషనల్ కలెక్టర్ సంగీత, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుని, ఓటర్ల నుంచి వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. సమర్పించిన ధ్రువపత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత కాలపరిమితిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 3,47,688 అనామలీస్ ఉన్నట్లు వివరించారు. వీరందరికీ నిబంధనల ప్రకారం సరైన విధానంలో నోటీసులు జారీ చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏఈఆర్‌ఓలు మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్‌కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షిస్తున్నామని ఆమె తెలిపారు. ఓటర్లు నిర్ణీత సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరయ్యేలా విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, మొత్తం ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్




## - పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ - యువత సద్వినియోగం చేసుకోవాలి-మోటివేషన్ స్పీకర్ బొంపల్లి ప్రకాష్

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:

పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నారాయణఖేడ్ నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం రితిన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆగస్టు 20న ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్, మోటివేషన్ స్పీకర్ బొంపల్లి ప్రకాష్ అన్నారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. హైదరాబాద్‌కు చెందిన ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో ఉచిత మెగా డెమో, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నారాయణఖేడ్‌లోని రితిన్స్ అకాడమీ స్టడీ హాల్‌లో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే జహీరాబాద్‌లోని రితిన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో పోలీస్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించి విజయాలు నమోదు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా నారాయణఖేడ్‌లోనూ విద్యార్థులు రితిన్స్ అకాడమీలో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. మరిన్ని వివరాలకు 83099 22874, 95029 12165 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు

## - గర్భిణీల సమస్యలపై సూపరింటెండెంట్ ఆరా

## - వెంటనే కుర్చీల ఏర్పాటు





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:**

ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ అన్నారు. బుధవారం స్కానింగ్, వైద్యుల సలహాల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కూర్చోవడానికి సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గర్భిణీలు డాక్టర్ రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చోట కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలతో పాటు ప్రతి రోగి పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగ్, వైద్యుల సలహాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ప్రతి రోగి సమస్యను సానుకూలంగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్య సేవలను మెరుగుపరుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

# ఫోటో, వీడియో గ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:**

ఫోటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నారాయణఖేడ్ డివిజన్ ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ ఉమా హారతికి వినతిపత్రం అందజేశారు. ఫోటో, వీడియో గ్రాఫర్లు సభలు, సమావేశాలు నిర్వహించు కునేందుకు సంఘ భవనం మంజూరు చేయాలని వారు కోరారు. అంతకుముందు నారాయణఖేడ్ పట్టణంలోని భవానీమాత ఆలయం నుంచి ఫోటో, వీడియో గ్రాఫర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు, ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.



# కన్సాన్‌పల్లి చెరువు కాపాడాలంటూ కదిలిన యువత..

### - సమగ్ర విచారణ జరిపి చెరువు ఎఫ్ టి ఎల్ నిర్ధారించాలని వినతి

### - సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో

**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

కన్సాన్‌పల్లి పెద్ద చెరువు పరిరక్షణ కోసం గ్రామ యువకులు అధికారులను ఆశ్రయించారు. చెరువు పరిధిలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, అసలు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ అందోల్ మండల తహసీల్దార్ మధుకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పెద్ద చెరువు నుంచి భారీ కాలువ తవ్వి నీటిని ఇతర చేపల చెరువులకు తరలిస్తున్నారని, మరోవైపు చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపల చెరువుల నిర్మాణాలు చేపడుతున్నారని యువకులు ఆరోపించారు. ఈ చర్యలతో చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అధికారిక రికార్డులు..క్షేత్రస్థాయి పరిశీలన

చెరువు అసలు విస్తీర్ణం ఎంత? ఎఫ్‌టీఎల్ హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయి? శిఖం భూమి ఎంత ఉంది? అనే అంశాలపై అధికారిక రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని కోరారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేస్తే చెరువు పరిధిలో జరుగుతున్న పనులపై స్పష్టత వస్తుందని కోరారు.

### నీటి వినియోగంపై స్పష్టత ఇవ్వాలి

చెరువు నుంచి నీటిని తరలించేందుకు అనుమతులు ఉన్నాయా? కాలువ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాలని యువకులు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద చెరువు గ్రామ ప్రజలు, రైతులకు ముఖ్యమైన నీటి వనరు కావడంతో భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చెరువును పరిరక్షించాలని యువకులు విజ్ఞప్తి చేశారు. రాములు, మాణిక్యం, ఈశ్వర్, మహేష్, నవీన్, ఆంజనేయులు, శేఖర్, రమేష్, మచ్చేందర్, గోవర్ధన్ తదితరులు కలిసి ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేశారు.



# గృహప్రవేశం, వివాహ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 19:**

నారాయణఖేడ్ పట్టణంలో జరిగిన నూతన గృహప్రవేశం, వివాహ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ పాల్గొని కుటుంబ సభ్యులు, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారంనియోజకవర్గ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ గృహప్రవేశ కార్యక్రమానికి నగేష్ కుమార్ షెట్కార్ హాజరై నరేష్ యాదవ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణఖేడ్ మున్సిపాలిటీకి చెందిన పరమహంస రాజు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద, మహేందర్, పరమేశ్, పాండు, మొగులప్ప, నియోజకవర్గ మధు, నారాయణరెడ్డి, భక్షీరం తదితరులు పాల్గొన్నారు.





# రైతుల కరెంట్ సమస్యలపై బీజేపీ వినతి

### - విద్యుత్ అంతరాయంతో పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సంగారెడ్డి జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకట నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కోర్పోల్ గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ అప్పా, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, బీజేవైఎం సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి, బేగరి మాణిక్యంతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పుల్కల్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నారని, సాగులో ఉన్న పంటలకు నిరంతర విద్యుత్ అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వివరించారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ పరికరాలను అందుబాటులో ఉంచి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వినతిపై స్పందించిన విద్యుత్ సూపరింటెండెంట్ సంబంధిత అధికారులకు బాధిత గ్రామాలకు అవసరమైన విద్యుత్ పరికరాలను సమకూర్చాలని సూచించారు. రైతుల పొలాలు ఎండిపోకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.



# మాణిక్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం..

## - మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

## - స్వర్గీయ పట్లోళ్ల మాణిక్‌రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు





**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

మాజీ లోక్‌సభ సభ్యుడు స్వర్గీయ పట్లోళ్ల మాణిక్‌రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా డాకూర్ గ్రామంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీ జైపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాణిక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాణిక్‌రెడ్డి చేసిన ప్రజాసేవను స్మరించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి, రాజకీయ జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జోగిపేట పట్టణ కేంద్రంలో పార్టీ శ్రేణులు కూడా ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పి. నారాయణ ముదిరాజ్, అర్జునయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, సర్పంచ్ వసంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎ. శంకరయ్య, లింగా గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పట్లూరి శివశేఖర్, నాగరత్నం గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, మాచర్ల విజయ్‌కుమార్, బిర్ల శంకర్, ఉస నాగరాజు, ఖాజా పాషా, రఫిక్, ఇమ్రాన్ ఖాన్, మొగులయ్య, పరిపూర్ణం, లింగం, ప్రశాంత్, కమలమ్మతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికల భద్రతే సమాజ బాధ్యత

## - కేజీబీవీలో రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, సైబర్ భద్రతపై అవగాహన

## - 3 వేల శానిటరీ ప్యాడ్ల పంపిణీ.. లక్ష్య సాధనకు కృషి చేయాలని అధికారుల పిలుపు





**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

బాలికల ఆరోగ్యం, విద్య, భద్రతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా బేటీ బచావోబేటీ పడావో కార్యక్రమం ముందుకు సాగుతోంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల రక్షణ, సైబర్ భద్రత, కెరీర్ లక్ష్యాలపై విస్తృత అవగాహన కల్పించారు.

### ఆరోగ్యంపై అవగాహనే రక్షణ

బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం, శానిటరీ ప్యాడ్లను సక్రమంగా వినియోగించడం, ఉపయోగించిన ప్యాడ్లను సురక్షితంగా పారవేయడం వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. రక్తహీనతను నివారించేందుకు ఐరన్‌తో పాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు, పాలు వంటి సమతుల్య ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు.

### 'సేఫ్ టచ్‌అన్‌సేఫ్ టచ్'పై ప్రత్యేక అవగాహన

బాలికల భద్రతకు సంబంధించి సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తమ శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హద్దులను గుర్తించడంతో పాటు అనుచిత స్పర్శ ఎదురైతే మౌనంగా ఉండకుండా వెంటనే నమ్మకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను ఆశ్రయించాలని సూచించారు.

### సైబర్ ప్రపంచంలో అప్రమత్తత అవసరం

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఫొటోలు, ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు.విద్యార్థినులు చిన్న వయస్సు నుంచే తమ కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకుని సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర కృషితో వాటిని సాధించాలని అధికారులు పిలుపునిచ్చారు. తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధి, వివిధ వృత్తి అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

### 3 వేల శానిటరీ ప్యాడ్ల పంపిణీ

కార్యక్రమంలో భాగంగా శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా విద్యార్థినులకు మొత్తం 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. బాలికల ఆరోగ్యం, భద్రత, విద్య, సాధికారతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఎంఆర్‌వో మధుకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ, ఎస్ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, విద్యార్థినులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు

**కల్హేర్ /నారాయణఖేడ్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

నారాయణఖేడ్ పట్టణంలోని హెచ్ఆర్ ప్యాలెస్‌లో పట్టణానికి చెందిన పరమహంస రాజు కుమారుడు సాయి సాత్విక్ వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పలువురు సీనియర్ జర్నలిస్టులు హాజరై నూతన వధూవరులు సాయి సాత్విక్, రుచితలను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జగన్ మోహన్, సీనియర్ జర్నలిస్టులు మాణిక్ ప్రభు, జీవన్ పటేల్, వెంకటేశం, ఎం.ఏ. ఖైసర్, వి. పుండరీకం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.



# మహదేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో సురేష్

**కల్హేర్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

కల్హేర్ మండలంలోని మహదేవ్‌పల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈవో) బి. సురేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, బోధనా పద్ధతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోలి సంజీవ్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం మండల రిసోర్స్ పర్సన్ వినయ్ బోధనా అంశాలు, విద్యా విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.





# వార్షిక తనిఖీలలో భాగంగా జహీరాబాద్ రూరల్ పిఎస్, టౌన్ సర్కిల్ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలన.
- స్టేషన్ రికార్డులు పెండింగ్ లేకుండా చూసుకోవాలి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి
- జహీరాబాద్ రూరల్ పిఎస్, టౌన్ సర్కిల్ కార్యాలయ అధికారుల, సిబ్బంది పనితీరు ప్రశంసనీయం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్









**జహీరాబాద్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గ జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్, టౌన్ సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు .ఈ సందర్భంగా జహీరాబాద్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీన పరచుకున్న లేదా కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసు కున్నారు. ప్రతి వాహనానికి సంబంధిత క్రైమ్ నెంబర్ రాయాలని, కేసు సంబంధిత ఆస్తు లను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యా చరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను (క్రైమ్ ప్రోన్ ఏరియాలు) బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, పగలు -రాత్రి బీట్ విధులలో నిఘా పెంచాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీ ఎన్ఎస్ -2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహ రించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్ -1 నుండి పార్ట్ -5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్ -2.0లో ఎప్పటి కప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.., స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తా మనే భరోసా కల్పించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలు తెలిసి ఉండాలని, పగలు, రాత్రి బీట్ విధులలో తనిఖీ చేస్తూ, ఎప్పటి కప్పుడు ఆన్లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. పాపిలాన్ డివైస్ ను వినియోగిస్తూ, అనుమా నిత వ్యక్తుల తనిఖీ చేస్తూ, వేలిముద్ర లను ద్వారా పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న పనితీరు మీ సేవా కాలమంతా ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తించి నప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య లు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురా వచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచిస్తూ, హెల్మెట్ ధరించని సిబ్బందిని విధుల్లోకి అనుమతించ కూడదని అధికారులకు సూచించారు. అనంతరం జహీరాబాద్ టౌన్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులు, సర్కిల్ పరిధిలోని పెండింగ్ లో ఉన్న నాన్-గ్రేవ్ కేసుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. లాంగ్ పెండింగ్ మిస్సింగ్, ఎన్.బి. డబ్ల్యూ కేసుల ఛేదన కోసం సర్కిల్ పరిధి లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించా లని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు. నేరాల ఛేదనలో, నియంత్ర ణలో కీలకంగా ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందం గా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలనిఅన్నారు.ముఖ్యంగా ప్రతి దాబా, పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతా లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా యజమానులకు సూచించాలని ఆదేశించారు.జహీరాబాద్ ప్రాంతం ఇతర రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉండటం వలన అక్రమ రవాణ జరగానికి అవకాశం ఉక్కువ అని, రాష్ట్ర సరిహద్దులలో నిఘా కట్టుదిట్టం చేయాలని, నాకబంధి నిర్వహిస్తూ, అక్రమా లకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు సూచించడం జరిగింది. సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డ్ లను ప్రకటించారు. ఈ వార్షిక తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంబడి జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి, సర్కిల్ ఎస్ఐ లు ఉన్నారు.



# ఇంటర్నెట్ యుగంలోనూ వివక్ష ఛాయలు

- దళితవాడల అభివృద్ధికి అడ్డంకులెందుకు?. - కోటరి నర్సింలు. కే. వి పి. ఎస్.

**కల్హేర్, ఆగస్టు 19:ప్రజా జ్యోతి**

సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ఇంటర్నెట్ యుగంలోనూ గ్రామీణ ప్రాంతాల్లో దళితవాడలు వివక్షకు గురవుతున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఉమ్మడి మండలాల పరిధిలోని పలు దళితవాడల్లో కనీస మౌలిక వసతులు కొరవడటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేవీపీఎస్ నాయకులు పేర్కొంటున్నారు.

**మౌలిక వసతుల కోసం ఎదురుచూపులు**

దళితవాడల్లో వీధిలైట్లు సక్రమంగా లేకపోవడం, అంతర్గత సీసీ రోడ్లు పూర్తిస్థాయిలో లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు ఆరోపించారు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగు నీరు నిలిచిపోవడం, రోడ్లు బురదమయంగా మారడం, దోమలు పెరగడం వంటి సమస్యలు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.మౌలిక వసతులు ప్రతి పౌరుడి హక్కు కాగా, కులం ఆధారంగా ఏ ప్రాంతానికైనా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. పౌరహక్కుల అవగాహన ఎక్కడ? ప్రతి నెల నిర్వహించాల్సిన పౌరహక్కుల దినోత్సవాలు, అవగాహన సదస్సుల విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేవీపీఎస్ కల్హేర్ మండల నాయకుడు బాబురావు విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన రక్షణలు, వివక్షకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.పౌరహక్కులపై అవగాహన పెరిగితేనే సామాజిక వివక్షను ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో పెరుగుతుందని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

**అభివృద్ధి అంటే అందరికీ సమాన హక్కు**

# కటుకం ప్రవీణ్ కుమార్ సోదరుల నూతన గృహ ప్రవేశ వేడుకకు

## - మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

జోగిపేట ప్రముఖ వ్యాపారవేత్త కటుకం ప్రవీణ్ కుమార్ సోదరుల నూతన గృహ ప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హాజరై నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించిన క్రాంతికిరణ్, నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పి. నారాయణ ముదిరాజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పట్లూరి శివశేఖర్, నాగరత్నం గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, మాచర్ల విజయ్‌కుమార్, బిర్ల శంకర్, ఉస నాగరాజు, రఫిక్, ఇమ్రాన్ ఖాన్, జెన్నా విజయ్‌కుమార్, ప్రదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

## - అందోల్ మండల జనరల్ బాడీ సమావేశంలో సర్పంచుల వినతులు

## - క్రాప్ బుకింగ్ నుంచి జలసిరి, ఇందిరమ్మ ఇళ్ల వరకు.. అధికారుల సమీక్ష





**అందోల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):**

గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని మండల ప్రత్యేక అధికారి పి. కిషన్ సూచించారు. బుధవారం మధ్యాహ్నం అందోల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల ప్రత్యేక అధికారులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించగా, ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల వారీగా సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

### క్రాప్ బుకింగ్‌పై ప్రత్యేక దృష్టి

మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారి సూచించారు. పంటను విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్రాప్ బుకింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

### సంక్షేమ పథకాలపై సమీక్ష

నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర సంక్షేమ పథకాల అమలు తీరును రెవెన్యూ అధికారులు వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### జలసిరిలో ప్రజల భాగస్వామ్యం

వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా చేపడుతున్న జలసిరి కార్యక్రమం, గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులపై సర్పంచులకు అధికారులు వివరించారు. ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమాలను విజయవంతం చేసేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

### ఫారం పాండ్స్.. మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో ఫారం పాండ్స్, గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని ప్రత్యేక అధికారి పి. కిషన్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.
సమావేశంలో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సర్పంచులు తమ వినతులను సమర్పించగా, సంబంధిత శాఖల అధికారులు వాటిపై స్పందించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల్లో సర్పంచులుఅధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# 12 లక్షల నిధుల మళ్లింపు.. రూ 11 లక్షల చెక్కుల బౌన్స్

## - బొక్కస్‌గావ్ పాక్స్ లో భారీ ఆర్థిక అక్రమాలు..- కార్యదర్శి సతీష్ సస్పెన్షన



**సిర్గాపూర్: కల్హేర్. 19.ఆగస్టు. ప్రజా జ్యోతి.**

సంగారెడ్డి జిల్లా ఉమ్మడి కల్హే ర్ సిర్గాపూర్ మండల పరిధిలోని బొక్కస్‌గావ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్ )లో భారీ ఆర్థిక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. సొసైటీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించడం, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి నిధులు బదిలీ చేయడం, చెల్లని చెక్కులు, అనుమానాస్పద వోచర్ల వినియోగం వంటి ఆరోపణలపై పాక్స్ కార్యదర్శి ఎం. సతీష్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం1964లోని సెక్షన్ 59 కింద , శాఖాపరమైన విచారణ పూర్తయ్యేంత వరకు సతీష్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జాయింట్ రిజిస్ట్రార్/జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

### పెట్రోల్ బంక్ పేరుతో రూ.12 లక్షల మళ్లింపు

అధికారుల ప్రాథమిక విచారణ ప్రకారం.. బొక్కస్‌గావ్ సొసైటీలో పెట్రోల్ బంక్ ప్రాజెక్టు ఏర్పాటు పేరుతో ఎలాంటి చట్టబద్ధ అనుమతులు, ఒప్పందాలు లేకుండానే విజయవాడకు చెందిన మెస్సర్స్ దివ్య ఎంటర్‌ప్రైజెస్‌కు రూ. 12 లక్షల సొసైటీ నిధులను అనధికారికంగా మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.అదే సంస్థకు సంబంధించిన రూ. 11 లక్షల విలువైన చెక్కులు బౌన్స్ కావడం మరింత వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంలో సొసైటీ ప్రయోజనాలను పట్టించుకోకుండా ఆర్థిక నిర్లక్ష్యం వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.వ్యక్తిగత ఖాతాలోకి రూ. 6.30 లక్షలుసొసైటీకి చెందిన రూ. 6.30 లక్షల నిధులను నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శి తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసి లావాదేవీలు నిర్వహించినట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సొసైటీ నిధులను వ్యక్తిగత ఖాతా ద్వారా నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.

### సూత్లి, దారం కొనుగోళ్లలోనూ అవకతవకలు

202021 ఆర్థిక సంవత్సరంలో సూత్లి, దారం సరఫరా కోసం కేటాయించిన రూ. 1.50 లక్షల వ్యయంలోనూ అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఖర్చులకు సంబంధించిన సరైన లెక్కలు చూపడంలో కార్యదర్శి విఫలమైనట్లు పేర్కొన్నారు.సరఫరాదారుల వోచర్లలో పేర్లు తారుమారు చేయడం, చెల్లుబాటు అయ్యే జీస్ట్ ఇన్‌వాయిస్‌లు లేకపోవడం, నగదు స్వీకరణకు సంబంధించిన రసీదులు సక్రమంగా లేకపోవడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు. ఒకే వోచర్‌పై వేర్వేరు తేదీల్లో క్లెయిమ్‌లు సృష్టించినట్లు కూడా దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.అంతేకాకుండా నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థకు కనీసం సరైన కార్యాలయ చిరునామా కూడా లేకపోవడం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు.సబ్ కలెక్టర్ విచారణ.. సమాధానం సంతృప్తికరం కాదని నిర్ణయం ఈ వ్యవహారంపై నారాయణఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్ (సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ) ప్రాథమిక విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కార్యదర్శి సతీష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయగా, ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని అధికారులు భావించారు. దీంతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

### సస్పెన్షన్ సమయంలో కఠిన ఆంక్షలు

సస్పెన్షన్ కాలంలో సతీష్‌పై పలు ఆంక్షలు విధించారు. ఉన్నతాధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా సొసైటీ ప్రాంగణంలోకి ప్రవేశించరాదని ఆదేశించారు. రోజువారీ పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని, సొసైటీ రికార్డులు, ఆన్‌లైన్ పోర్టల్స్‌ను ముట్టుకోరాదని స్పష్టం చేశారు.అలాగే సొసైటీకి సంబంధించిన పూర్తి బాధ్యతలను వెంటనే మరొకరికి అప్పగించాలని ఆదేశించారు.

### రికవరీపై దృష్టి

సొసైటీకి నష్టం కలిగిన నిధులు, బౌన్స్ అయిన చెక్కుల మొత్తాల రికవరీతో పాటు, బాధ్యులపై తదుపరి శాఖాపరమైన చర్యలకు సంబంధించి చట్టబద్ధ విచారణను వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.